కాలుమోపిన మైనంపల్లి..

ఖితమైన కాంగ్రెస్



- మూకుమ్మడి రాజీనామాలతో మల్కాజిగిరి కాంగ్రెస్ ఖాళీ
- నందికంటి బాటలోనే పార్టీని వీడిన నియోజకవర్గం, డివిజన్ నాయకులు
- బీసీ నేత శ్రీధర్‌ను వంచించారంటూ పెల్లుబికిన నిరసన
- రెంటికి చెడ్డ రేవడిలా 'మైనంపల్లి' పరిస్థితి

కాంగ్రెస్‌లో బీసీలకు అన్యాయం

అసెంబ్లీ ఎన్నికల నగారా మోగకముందే కాంగ్రెస్ ఖాళీ అవుతున్నది. గ్రేటర్ హైదరాబాద్‌లో అసలే అంతంత మాత్రమే ఉన్న హస్తం పార్టీ పరిస్థితి ప్యారాచూట్ నేతలతో మరింత కుదేలవుతున్నది. ముఖ్యంగా మైనంపల్లి హన్మంతరావు రాకతో నిన్నటికి నిన్న మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పగా.. అందుకు కొనసాగింపుగా మంగళవారం పెద్ద ఎత్తున మల్కాజిగిరి కాంగ్రెస్ నేతలు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. దీంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఎలాగూ మైనంపల్లి కాంగ్రెస్‌లోకి గుప్పెడు మంది అనుచరులతో వచ్చినందున ఇకముందు మల్కాజిగిరి కాంగ్రెస్‌లో వారే అంతా తామై వ్యవహరిస్తారనేది నుస్పష్టం. ఈ నేపథ్యంలో మైనంపల్లికి టికెట్ ఖరారైన తర్వాత సాధారణ కాంగ్రెస్ కార్యకర్త సైతం ఆ పార్టీలో ఉండే పరిస్థితి ఉండదనే ఆందోళన వ్యక్తమవుతున్న దరిమిలా నియోజకవర్గంలో కాంగ్రెస్ ఖాళీ ఖాయంగానే కనిపిస్తున్నది.

- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ)/మల్కాజిగిరి

మల్కాజిగిరి కాంగ్రెస్‌కు మైనంపల్లి సెగ బాగానే తగిలింది. ఆ పార్టీ కండువా కప్పుకొని ఆయన హైదరాబాద్‌లో కాలు మోపింది మొదలు.. ఏ ఒక్కరూ కాంగ్రెస్‌లో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. హన్మంతరావు ఢిల్లీ నుంచి నగరానికి చేరుకున్న రోజే సోమవారం సాయంత్రం కాంగ్రెస్‌కు కోలు కోలేని దెబ్బ తగిలింది. డీసీసీ అధ్యక్షుడు, కీలకమైన బీసీ నేత నందికంటి శ్రీధర్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే తమ నిర్ణయాన్ని మంగళవారం ప్రకటిస్తామని చెప్పిన నియోజకవర్గంలోని కీలక కాంగ్రెస్ నేతలు ఊహించి నట్లుగా హస్తం పార్టీని వీడేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి తాము మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు.. మల్కాజిగిరి కాంగ్రెస్ ఇక పరిస్థితి దారుణంగా మారింది.

అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్న నాయకులు

మల్కాజిగిరి చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో నాయకులు సమావేశం నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు, మైనారిటీ సెల్ కన్వీనర్, మీడియా సెల్ కన్వీనర్, కార్యదర్శులు సంయుక్తంగా మాట్లాడారు. పార్టీ కోసం 30 సంవత్సరాలుగా సేవలందించిన నందికంటి శ్రీధర్ బీసీ వర్గానికి చెందిన నాయకుడని అన్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా శ్రీధర్ సేవలందించారని గుర్తు చేశారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పాత్రులో భాగంగా శ్రీధర్ తన టికెట్‌ను త్యాగం చేశారన్నారు. దీంతో ఈసారి ఆయనకు టికెట్ వస్తుందని అందరం ఆశించామన్నారు. ముఖ్యంగా ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం కుటుంబానికి ఒక టికెట్ ఇవ్వాలని తీర్మానం చేసినా.. దానిని విస్మరించడంతో పాటు ఇతర పార్టీల నుంచి వచ్చిన వ్యక్తికి టికెట్ ఖరారు చేయడంతో పాటు ఆయన కుటుంబంలో రెండో టికెటు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ దుర్మార్గానికి నిదర్శనమన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో బీసీలకు న్యాయం జరగదని తేలినందున.. పార్టీకి రాజీనామా చేస్తున్నామన్నారు. వేరే పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి టికెట్ ఇచ్చి పార్టీని నమ్ముకున్న బీసీ నేతను బలి చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మేడ్చల్ జిల్లా జాయింట్ సెక్రటరీ సూర్యప్రకాశ్, మల్కాజిగిరి, మౌలాలి, వినాయక్‌నగర్ డివిజన్ల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌కుమార్, గద్వాల వంశీ ముదిరాజ్, మీడియా కన్వీనర్ గుత్తి రాంచందర్, మైనారిటీ సెల్ వైర్మన్ మహ్మద్ అలీ, ప్రధాన కార్యదర్శి ఎంబర్ శ్రీనివాస్ యాదవ్, లీగల్ అడ్వైజర్ బాలరాజు, రాములు, చిట్టల్ ముదిరాజ్, కిరణ్ కుమార్, నరసింహగౌడ్, బాలకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీ ఉదయ్‌బాబు, యాత్ అధ్యక్షుడు రెబ్బ వాసు, ఉపాధ్యక్షుడు చిట్నాల, అజయ్, రేవంత్‌నాయుడు, ఎన్ఎస్‌యూఐ సాయి, సాయిరాం, 140వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు నవనీత, మైనారిటీ వైస్ చైర్మన్ షహీన్ సుల్తానా, విజయలక్ష్మి, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'మైనంపల్లి' తర్జనభర్జన

హైకమాండ్ ఎర్ర తివాచీ పరిచి టికెట్‌పై హామీ ఇచ్చినా.. క్షేత్రస్థాయిలో పార్టీ నేతలు, శ్రేణులు పెద్ద షాక్ ఇవ్వడంతో మైనంపల్లి హన్మంతరావులో ఆందోళన మొదలైనట్లు తెలుస్తున్నది. ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత భారీ ర్యాలీతో మల్కాజిగిరిలో హంగామా చేద్దామని అనుకున్నప్పటికీ ఇక్కడ పరిస్థితులు చూసి మిన్నకున్నట్లు అర్థమవుతుంది. ముఖ్యంగా ఆయన నగరానికి వచ్చిన తర్వాత తన వెంట ఉన్న అనుచరులే తప్ప మల్కాజిగిరి కాంగ్రెస్‌కు చెందిన వారెవరూ ఆయనను సంప్రదించకపోవడం గమనార్హం. దీంతో మంగళవారం పూర్తిగా ఆయన ఇంటికే పరిమితం అయ్యారు. పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న నందికంటి శ్రీధర్‌తో పాటు మంగళవారం మూకుమ్మడి రాజీనామాలు జరగడంతో నియోజకవర్గంలో ముందుకు అడుగులు వేయడమెలా? అని మైనంపల్లి వర్గం తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. ఒకవైపు బీఆర్ఎస్ నుంచి తనతో పాటు ఒక రిద్దరు మినహా ఎవరూ రాక.. ఇటు చేరిన కాంగ్రెస్‌లో ఎవరూ లేక... రెంటికి చెడ్డ రేవడిలా పరిస్థితి తయారైందనే అంతర్మథనంలో ఆయన వర్గం ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

అల్వాల్ సర్కిల్‌లో రాజీనామాలు

మల్కాజిగిరి, అక్టోబర్ 3 : అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. మంగళవారం అల్వాల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తమ రాజీనామా పత్రాలను నందికంటి శ్రీధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు జోలి రమేశ్, సీఎల్ యాదగిరి, సూర్యప్రకాశ్ రెడ్డి, శ్రీనివాస్, పవన్, శివశంకర్, సంజీవరెడ్డి, సత్యనారాయణ రాజు, ఫహీమ్, పద్మా, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బీసీలను విస్మరించింది

కాంగ్రెస్ పార్టీ బీసీలను విస్మరించింది. పార్టీ జెండా మోసి లాఠీ దెబ్బలు తిని కేసులు ఎదుర్కొన్న నందికంటికి టికెట్ ఇవ్వక పోవడం అన్యాయం. శ్రీధర్‌తోనే పార్టీ క్యాడర్ ఉంది. శ్రీధర్ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తాం.

– గుత్తి రాంచందర్, మీడియా సెల్ కన్వీనర్

నమ్ముకున్న వారికి గుర్తింపు లేదు

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్‌కు పార్టీ టికెట్ నిరాకరించడం దారుణం. పార్టీని నమ్ముకున్న వారికి సరియైన గుర్తింపు లేకపోవడంతో మానసికంగా కృంగిపోతున్నాం. నందికంటి శ్రీధర్ వెంట నడవడానికి సిద్ధంగా ఉన్నాం. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగులుతుంది.

– సంతోష్‌కుమార్, వినాయక్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు

కాంగ్రెస్ పార్టీది తప్పుడు నిర్ణయం

మల్కాజిగిరి నియోజకవర్గం పార్టీ క్యాడర్ నందికంటి శ్రీధర్ వెంట ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు నిర్ణయాలు తీసుకుంది. నందికంటికి టికెట్ ఇచ్చిఉంటే అభ్యర్థిని గెలిపించుకునే వారిమి. ప్రస్తుతం మల్కాజిగిరి సర్కిల్‌లో పార్టీకి మనుగడ కష్టం. కొత్త అభ్యర్థిని ఎంపిక చేయడంతో ప్రజల్లో గందరగోళం ఏర్పడింది.

– వి.శ్రీనివాస్ గౌడ్, మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షుడు

క్యాడర్ ఆగ్రహంతో ఉన్నారు

మల్కాజిగిరి సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగలడం కాయం. పార్టీకి సేవలు చేసిన వారికి గుర్తింపు ఇవ్వకపోవడంతో పార్టీ క్యాడర్ ఆగ్రహంతో ఉన్నది. ఎన్నికలు వచ్చినప్పుడు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. నందికంటి శ్రీధర్ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ మనుగడను కాపాడారు. జిల్లా అధ్యక్షుడికే టికెట్ ఇవ్వకపోవడంతో క్యాడర్ ఆగ్రహంతో ఉన్నారు.

– వంశీముదిరాజ్, మౌలాలి డివిజన్ అధ్యక్షుడు

నందికంటి వెంటే ఉంటాం

కాంగ్రెస్ పార్టీ కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వకపోవడంతో క్యాడర్ నిరుత్సాహంగా ఉన్నారు. క్యాడర్ అంతా నందికంటి వెంట ఉన్నారు. నందికంటి పార్టీకి రాజీనామా చేసిన తర్వాత కనీసం పార్టీ పెద్దలు పలుకరించలేదు. కాంగ్రెస్ పార్టీకి మల్కాజిగిరి నియోజకవర్గంలో జీవం పోసిన నందికంటిని పార్టీ పెద్దలు నిలువునా మోసం చేశారు. అందుకే రాజీనామా చేశాం.

– శ్రీనివాస్ యాదవ్, వినాయక్‌నగర్ డివిజన్ కార్యదర్శి

టికెట్ వస్తుందో.. రాదో..

నా బాధ ఎవరికి చెప్పను..?

- నోటిఫికేషన్ గడువు సమీపిస్తున్నా.. ప్రతిపక్షాల్లో అభ్యర్థుల ప్రకటన ఊసేలేదు
- ప్రచారం చేసి.. టికెట్ రాకపోతే డబ్బులు దండుగనే భావన
- పార్టీ మారే యోచనలో నాయకులు, కార్యకర్తలు
- వేచి చూద్దామని క్యాడర్‌ను సముదాయిస్తున్న ఆశావహులు

నిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : అధికార పార్టీ జోరుకు కాంగ్రెస్, బీజేపీలు కుదేలవుతున్నాయి. ఇప్పటికే అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలో ప్రజల మన్ననలు అందుకుంటున్నది. గ్రేటర్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చేందుకు తీసుకున్న చర్యలు.. భవిష్యత్తు ప్రణాళికలను వివరిస్తున్నారు. వీరి ప్రచారం చూస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులు బెంబేలెత్తిపోతున్నారు. అగ్రనాయకుల తీరుతో ఏం చేయాలో తెలియక ఇంట్లోనే ఓ మూలన కూర్చోవాల్సిన దుస్థితి వచ్చింది. ఇప్పటికీ అభ్యర్థులను ప్రకటించకపోవడంపై ఆ క్యాడర్ అంతా అసహనం వ్యక్తం చేస్తుంది. 'గిట్ల అయితే డిపాజిట్లు కూడా రాస్తే.' అని కాంగ్రెస్, బీజేపీ పార్టీ కార్యకర్తలు తమ నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిమ్మల్ని నమ్ముకోవడం కంటే అధికార పార్టీ కండువా కప్పుకోవడం మేలని చాలా మంది కార్యకర్తలు ఆలోచిస్తున్నారు. అందులో భాగంగానే బీఆర్ఎస్ పార్టీలోకి గ్రేటర్‌లో ప్రతిపక్షాల నుంచి వలసలు పెరుగుతున్నాయి. ఇదిలా ఉండగా టికెట్ ఆశించే ఆశావాహులు తమ పరిస్థితి క్యాడర్‌కు చెప్పకోలేక.. ఏం చేయాలో తెలియక రాత్రిల్లు కంటిమీద కునుకు ఉండటం లేదని ఆవేదన చెందుతున్నట్టు సమాచారం.

ప్రతిపక్షంలో నైరాశ్యం..

అధికార పక్షంలో ఉత్సాహం

హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకోవడంపై దృష్టి

మొన్నటి వరకు టికెట్ తమకే వస్తుందని హడావిడి చేసిన నాయకులు ప్రస్తుతం మొఖం చాటేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల హైకమాండ్ ఢిల్లీలో ముడిపడి ఉండటంతో ఈ సమస్య వస్తుందని వారు చర్చించుకుంటున్నారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీల టికెట్లు ఆశిస్తున్న వారిలో చాలా మంది ప్రచారం విషయంలో ఆలోచనలో పడ్డారు. ఓ రోజు ఒకరికి.. మరో రోజు మరొకరికి వస్తుందని ప్రకటనలు వెలువడుతుండటంతో టికెట్ గ్యారంటీ లేదని ఆశావాహులు తెలిసిన వారి దగ్గర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోనీ ధైర్యం చేసి టికెట్ తమకే అని నియోజకవర్గంలో ప్రచారం మొదలుపెడితే.. అంత ఖర్చు పెట్టినా టికెట్ రాకుంటే ఎలా అంటూ వారంతా హైరానా పడుతున్నారు. ప్రచారం కాదు.. టికెట్లు కోసం హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకోవడంపై దృష్టి సారిస్తున్నారు. టికెట్ ప్రకటన ఇంగో అలస్యమైతే డిపాజిట్లు కూడా రావని ప్రతిపక్షాలు గుట్టుగా చర్చించుకుంటున్నాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియనే ఇంకా ప్రారంభం కాకపోవడంతో కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు నైరాశ్యంలో మునిగిపోయాయి.

ఇదిగో మౌనం ఇలా..

- ముషీరాబాద్‌లో దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మి ప్రచారం చేసింది. కానీ ఇప్పుడు సైలెంట్ అయిపోయింది. తాజా పరిణామాలతో ప్రచారంలో జోరు తగ్గించారు.
- జూబ్లీహిల్స్ నుంచి పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి ప్రచారం చేసుకున్నాడు. కానీ ఆ స్థానం మరో నేతకు దక్కుతుందనే వార్తలు రావడంతో ఆయన ప్రచారంలో సైలెంట్ అయిపోయారు. క్యాడర్‌ది కూడా అదే దారి.
- అంబర్‌పేటకు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆ స్థానానికి పెద్ద ఎత్తున లాబియింగ్ ఉండటంతో ఇప్పుడు అతను ఊసెత్తడం లేదు.
- కంటోన్మెంట్‌లో మాజీ మంత్రి శంకర్‌రావు కూతురు బరిలో ఉంటానని ఇప్పటికే హడావిడి చేసింది. కానీ ఇప్పుడు ఆమె సైలెంట్ అయిపోయింది.
- సికింద్రాబాద్ నుంచి సినీ నటి జీవిత బీజేపీ క్యాండిడెట్‌గా దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆ స్థానంలో స్థానికేతరులు రావొద్దంటూ ఆ పార్టీ నేతలు సపోర్ట్ చేసే పరిస్థితి లేదు. అందులోనూ టికెట్ గ్యారంటీ లేక ఆమె సైలెంట్ అయిపోయారు. అందుకే మూడు, నాలుగు చోట్ల ఆమె కర్చీఫ్ వేసి పెట్టారు.
- గోషామహల్ నుంచి ఎమ్మెల్యేగా రాజాసింగ్ ఉన్నారు. కానీ పార్టీ అతడిపై సస్పెన్షన్ విధించడంతో ప్రచార బాధ్యతలు వదిలేశాడు. టికెట్ ఎవరికి వస్తుందో తెలియక ఆయన అనుచరులు కూడా సైలెంట్ అయిపోయారు.

అన్నా.. మన ప్రచారం ఎప్పుడే. ఇప్పటికే గులాబీ పార్టీ దూసుకుపోతున్నది. గల్లీ గల్లీ చుట్టేస్తుండ్రు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులందరూ ప్రజాక్షేత్రంలో ఉన్నారు. హ్యాట్రిక్ విజయం అందరికంటే ముందే ప్రజలు అదే స్థాయిలో వారందరికీ పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతుండ్రు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రధాన ఎజెండాగా వారంతా గట్టిగానే తిరుగుతుండ్రు. గిట్లయితే మనం గెలవడం కష్టమే. అలస్యమైతే డిపాజిట్లు కూడా రావన్న. తొందరగా ప్రచారం మొదలుపెడుదామే. నువ్వే మా క్యాండెట్. ఢిల్లీవోళ్లు ఏమంటుండ్రు? ఏమంటవు అన్నా.

– ఇది టికెట్ తమ నాయకుడికే వస్తుందనే ఆశతో ఉన్న క్యాడర్ ఆవేదన

తమ్మీ నీ బాధ నాకు ఎరుకైతుంది. కానీ నా బాధ గీడ ఎవ్వడు ఇంటలేదు. నేను 30 ఏండ్లకు పైగా రాజకీయాల్లో ఉన్నా. గతంలో పలుమార్లు ఎమ్మెల్యేగా ఉన్న. ఎప్పుడు లేని దుస్థితి ఈసారి వచ్చి పడింది. రాత్రి నిద్దురకూడా సక్కగ పడతలే. టికెట్ వస్తదో.. రాదో.. కూడా తెలియని పరిస్థితి నాది. మనం అనుకుంటున్న నియోజకవర్గం నుంచి పోటీచేసేది నేనా.. కాదా..? అనే విషయం కూడా నాకు క్లాలీటీ లేదు. మొన్నటి వరకు నా వెంట తిరిగినోళ్లే నాకన్న ఎక్కువగా హై కమాండ్ వద్ద లాబియింగ్ చేస్తుండ్రు. టికెట్ ఇవ్వాల్సిందేనని గట్టిగానే కూసుండ్రు. ఇలాంటి పరిస్థితుల్లో ఆగమాగమవ్వడం ఎందుకు తమ్మీ.. మాద్దాం.. ఏం జరుగుతుందో... ప్రచారం మొదలుపెట్టాక టికెట్ రాకపోతే ఇజ్జత్ పోదా తమ్మీ..

– ఇది కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఓ ముఖ్య నేత పరిస్థితి

మంత్రి సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన అకాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు

ఇప్పుడు పార్టీ కోసం పనిచేయండి రానున్న ఐదేండ్లు మీ కోసం పనిచేస్తా..

- పార్టీలో చేరిన వారితో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 3 : సీఎం కేసీఆర్ ఒక విజన్‌తో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం మండల పరిధిలోని అకాన్‌పల్లికి చెందిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు 125 మంది గ్రామ సర్పంచ్ ముక్కెర యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోతు రాజునాయక్, చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. రానున్న 9 నెలలు పార్టీకోసం, నా కోసం పని చేస్తే ఆ తర్వాత 5 సంవత్సరాలు మీకోసం పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మంత్రి సబితా ఇంద్రారెడ్డికి పూర్తి మద్దతు తెలిపి, మహేశ్వరం నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు మైసమ్మ, రజిత, నాయకులు సామయ్య, కుమార్, సుదర్శన్, శంకరయ్య, బాల్‌రాజ్, ప్రభాకర్, నర్సింహ, యాదయ్య, వెంకటేశ్, నారాయణ, సురేశ్, కుమార్, శంకరమ్మ, గణేశ్, అమృత ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బుగ్గల జంగయ్య, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, తదితరులు

కాచిగూడలో బీజేపీకి షాక్

- కాచిగూడ డివిజన్ బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు బీఆర్ఎస్‌లో చేరిక

కాచిగూడ, అక్టోబర్ 3 : దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కాకపోతే ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎంతగానో విశ్వసిస్తున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ వ్యాప్తంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాచిగూడ డివిజన్ బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు మడిశెట్టి ప్రతిభతో పాటు మరో 70 మంది బీజేపీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పరిపాలన కొనసాగుతున్నదని, అందుకే ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతూ, సీఎం కేసీఆర్ పరిపాలనకు జేజేలు పలుకుతున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు మడిశెట్టి ఆనంద్, ఎం.రాధిక, కె.శైలజ, విమల, ఎస్.సంగీత, శీలం మహేశ్వరి, ఎస్.నందగోపాల్, ఆర్.రాజు, ఎం.తిలక్, సత్యనారాయణ, భీష్మదేవ్, బి.కృష్ణా గౌడ్, బి.నర్సింగ్‌యాదవ్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.